క్లుప్తంగా

ఆర్యవైశ్యుల ఆత్మీయ సమావేశం

రామచంద్రపురం పట్టణంలో ఆర్యవైశ్య సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఆత్మీయ సమావేశం సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. స్కూల్ పిల్లలకు పుస్తకాలు, పెన్నులు బహూకరించారు. ఈ సందర్భంగా మంత్రి సుభాష్ సంఘ భవనానికి నిధులు మంజూరు చేసి భవనాన్ని అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షులు కాళ్లకురి సత్యనారాయణ జిల్లా సెక్రటరీ కంచర్ల చిన్న భద్రరావు, గౌరవ అధ్యక్షులు అఖిలాండ మూర్తి, ఆర్యవైశ్య సంక్షేమ సంఘం ఆర్యవైశ్య యువజన సంఘం, ఆర్యవైశ్య మహిళా మండలి నాయకులు పాల్గొన్నారు.

నెలాఖరు నుంచి ఈ-పంట నమోదు

కె.గంగవరం: ఈ ఏడాది ఖరీఫ్‌కు సంబంధించి ఈ నెలాఖరు నుంచి ఈ-పంట నమోదు జరుగుతుందని మండల వ్యవసాయాధికారి బలుసు రవి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పంట నమోదుకు రైతులందరూ సిద్ధగా ఉండాలన్నారు. మండల వ్యాప్తంగా ఇప్పటి వరకు 2,320 ఎకరాలలో రైతులు వెద జల్లడం, 3180 ఎకరాల్లో నాట్లు వేశారన్నారు. మొత్తం 5500 ఎకరాల్లో నాట్లు పూర్తయ్యాయని చెప్పారు. ప్రస్తుతం వర్షాలు కురవడం వల్ల మండల వ్యాప్తంగా ఇప్పటి వరకు ఎటువంటి నష్టం లేదని అయితే ఎక్కడైనా వర్షాల వల్ల నాట్లు నీటమునిగితే తగిన చర్యలు తీసుకోవాలని సూచనలు, సలహాల కోసం ఆయా గ్రామాల్లోని వ్యవసాయ సహాయకులను సంప్రదించాలని కోరారు.

విద్యార్థులకు కిట్ల పంపిణీ



విద్యార్థికి యూనిఫాం అందిస్తున్న ఎమ్మెల్యే వేగుళ్ల, చైర్‌పర్సన్ దుర్గారాణి

మండపేట: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే విద్యార్థులకు ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు, మున్సిపల్ చైర్‌పర్సన్ పతివాడ దుర్గారాణి స్టూడెంట్ కిట్లను పంపిణీ చేశారు. పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో జరిగిన కిట్ల పంపిణీ కార్యక్రమంలో వారు ముఖ్య అతిథులుగా హాజరై విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, బ్యాగ్‌లు, యూనిఫాం అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ చుండ్రు శ్రీవర ప్రకాష్, కౌన్సిలర్లు యరమాటి గంగరాజు, మండపల్లి రవికుమార్, గుండు రామతులసి, కాశిన కాశీ విశ్వనాథం, కాళ్లకూరి స్వరాజ్య భవాని, చింతలపూడి దుర్గ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వినియోగదారుల ఫోరం రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ మెంబర్‌గా అభిరామ్



రామచంద్రపురం రూరల్: వినియోగదారుల ఫోరం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా చైర్మన్‌గా విధులు నిర్వహిస్తున్న ద్రాక్షారామకు చెందిన దేవులపల్లి శ్రీకృష్ణ అభిరామ్‌ను రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ మెంబర్‌గా నియమించారు. ఈ మేరకు రాష్ట్ర అధ్యక్షుడు కుదారి తిరుపాలు ఉత్తర్వులు జారీ అందాయి. జిల్లా చైర్మన్‌గా అనతి కాలంలోనే వినియోగదారులకు నీతి, నిజాయితీ, నిబద్ధతతో సేవలు అందించడం వల్ల ఆయన సేవలను రాష్ట్రమంతా వినియోగించుకోవాలని నిర్ణయం తీసుకున్నట్టు ఉత్వర్వుల్లో పేర్కొన్నారు. అభిరామ్‌ను పలువురు అభినందించారు.

విద్యార్థులను అభినందించిన మంత్రి



ద్రాక్షారామలో విద్యార్థినులను అభినందిస్తున్న మంత్రి సుభాష్

రామచంద్రపురం రూరల్: ద్రాక్షారామకు చెందిన సూర్య ఇంగ్లీష్ మీడియం హైస్కూల్‌లో చదివి పదో తరగతిలో 600 మార్కులకు గాను 593 మార్కులు సాధించి శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీలో సీట్లు సాధించిన విద్యార్థినులు కడియాల గీతాశ్రీ, గాలి హేమనాగసారికలను రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ సోమవారం అభినందించారు. దుశ్శాలువాలతో వారిని మంత్రి సత్కరించారు. వారి అభ్యున్నతికి కృషి చేసిన పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు, తల్లితండ్రులను అభినందించారు.

జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోండి

రామచంద్రపురం: వికాస సంస్థ ఆధ్వర్యంలో ఈనెల 20వ తేదీన రామచంద్రపురం పట్టణంలోని వీఎస్ఎం కళాశాల ప్రాంగణంలో నిర్వహించనున్న మెగా జాబ్ మేళాను నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ తెలిపారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో ఆయన మీడియా సమావేశంలో మెగా జాబ్ మేళా పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. 1859 ఉద్యోగాల భర్తీ అవకాశముందని తెలిపారు. కడియాల రాఘవ పలువురు స్థానిక ప్రజాప్రతినిధులు వికాస తరఫు ప్రతినిధులు పాల్గొన్నారు.

విధి విధానాలెంటో



ఇంటింటికీ ఉద్యోగం హామీతో నిరుద్యోగులంతా ఆసక్తిగా ఉన్నారు. సచివాలయానికి వెళ్లి అడిగితే ఇంకా విధి విధానాలు రాలేదంటున్నారు. సైట్ ఓపెన్ కావడంలేదు. ప్రతి ఇంటికి ఉద్యోగం తప్పనిసరిగా ఇస్తానంటూ చంద్రబాబు కచ్చితంగా చెప్పారు. ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలి.

– యరమాటి వెంకన్నబాబు, సామాజిక కార్యకర్త, మండపేట

మాట నిలబెట్టుకోవాలి



ఏ ప్రభుత్వానికైనా ప్రజలు ఐదేళ్ల అవకాశమిస్తారు. ఇచ్చిన హామీని వెంటనే అమలు చేస్తే ప్రజలు పూర్తి స్థాయిలో లబ్ధిని పొందగలుగుతారు. అర్హులకు నిరుద్యోగ భృతిని ఇస్తామని చంద్రబాబు హామీ ఇచ్చారు. ఆ దిశగా ప్రభుత్వం అడుగులు వేయాలి. నిరుద్యోగులను ఆదుకోవాలి.

– చోడే శ్రీకృష్ణ, విద్యార్థి సంఘం రాష్ట్ర నాయకులు, మండపేట

ఎప్పుడు ఇస్తారో



ఎన్నికల ముందు నిరుద్యోగులందరికీ నిరుద్యోగ భృతి ఇస్తామని సీఎం చంద్రబాబు హామీ ఇచ్చారు. కొత్త ప్రభుత్వం వచ్చి నెలదాటుతున్న ఇప్పటికీ నిరుద్యోగ భృతి ఊసే లేదు. ఇచ్చిన హామీ మేరకు ప్రభుత్వం వెంటనే నిరుద్యోగ భృతిని అందించాలి.

– గండుబోయిన రాజ్‌కుమార్, అముజూరు, కె.గంగవరం

ఆ ఆశతోనే ఓటు వేశాం



కూటమి నేతలు ఇచ్చిన హామీలు నెరవేర్చుతారని నమ్మి ఓటు వేశాం. నిరుద్యోగులందరికీ ఉద్యోగాలు ఇస్తామని ప్రభుత్వం మాట ఇచ్చింది. లేకపోతే నిరుద్యోగ భృతి కింద ప్రతి ఒక్కరికి రూ.3 వేలు ఇస్తామని ప్రకటించారు. ఇప్పటి వరకు ఎలాంటి ప్రకటన లేదు. అసలు ఇస్తారో లేదు.

– పెంకే శివ, పామర్రు, కె.గంగవరం మండలం

నిరుద్యోగ భృతి భ్రమేనా!

- ఇంటికో ఉద్యోగం ఎప్పుడిస్తారు
- ప్రశ్నిస్తున్న నిరుద్యోగులు
- నిరుత్సాహంలో యువత



రామచంద్రపురం: ప్రతి ఇంటికీ ఉద్యోగం లేదా ప్రతి నెలా రూ.3వేల నిరుద్యో భృతి కల్పిస్తామంటూ గత ఎన్నికల మేనిఫెస్టోలో సూపర్ సిక్స్ హామీలతో మెరిపించిన కూటమి ప్రభుత్వం ఎన్నికలయ్యాక వాటి ఊసు ఎత్తడంలేదు. దీంతో నిరుద్యోగులంతా నిరుత్సాహానికి గురవుతున్నారు. జాబ్ క్యాలెండర్‌పై గంపెడాశలు పెట్టుకున్న నిరుద్యోగులు చంద్రబాబునాయుడు ఇచ్చిన హామీ మేరకు ఉద్యోగం వస్తుందని, లేదా నిరుద్యోగ భృతి వస్తుందని ఎదురుచూపులు చూస్తున్నారు. సూపర్ సిక్స్ అంటూ ఉమ్మడి మేనిఫెస్టోలో నిరుద్యోగులకు పెద్దపీట వేస్తున్నట్టు ప్రకటనలు చేశారు. తీరా ఎన్నికలయ్యాక ఉద్యోగ ప్రకటనలు లేక, నిరుద్యోగ భృతి ఇవ్వక నిరుద్యోగులను మబ్బెపెడుతున్నారు. రామచంద్రపురం నియోజకవర్గంలో సుమారు 18510, మండపేట నియోజకవర్గంలో సుమారుగా 14,540 మంది నిరుద్యోగులున్నట్టు అంచనా.

అతీ గతీ లేని డీఎస్సీ

ప్రతి ఇంటికి ఒక ఉద్యోగం చదువుతో సంబంధం లేకుండా ఇస్తామని చెప్పిన చంద్రబాబు నాయుడు ఉమ్మడి మేనిఫెస్టో ఇప్పటివరకూ అమలుకు నోచుకోలేదు. మొదటి సంతకంతో మెగా డీఎస్సీ అని చెప్పి కేవలం రాష్ట్రంలో 16వేల ఉపాధ్యాయ పోస్టులతో సరిపెట్టి మెగా దగా చేశారు. అదీ కూడా అతీ గతీ లేకుండా ఉందని నిరుద్యోగ యువత ఆవేదన వ్యక్తం చస్తున్నారు. గతంలో చంద్రబాబు నిరుద్యోగ భృతిగా రూ.2వేలు ఇస్తామని చెప్పి అయిదేళ్ల పబ్బం గడిపి మోసం చేశారు. ఇంటికో ఉద్యోగం అని ఊదరగొట్టి నిరుద్యోగులను నట్టేట ముంచారు. ఇప్పుడు కూడా అదే తరహా మోసానికి పాల్పడుతున్నట్టు ప్రభుత్వం తీరు ఉందని నిరుద్యోగులకు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.

మండలం	గ్రామాలు	కుటుంబాలు	నిరుద్యోగులు
రామచంద్రపురం నియోజకవర్గం			
రామచంద్రపురం రూరల్, అర్బన్	25	32630	6526
కె.గంగవరం	26	18392	3678
కాజులూరు	26	20174	4034
మండపేట నియోజకవర్గం			
మండపేట రూరల్ అర్బన్	12	39374	7874
రాయవరం	12	20233	4046

రూ. రెండు వేలు ఇచ్చి దులిపేసుకున్నారు...

2014- 19 టీడీపీ ప్రభుత్వ హయాంలో కేవలం ఎన్నికలకు ముందు అరకొరగానే నిరుద్యోగ భృతికి నిధులు కేటాయించి చేతులు దులుపుకొన్నారు. అప్పట్లో రెండు నియోజకవర్గాలో సుమారుగా 23వేల మంది నిరుద్యోగ యువత ఉండగా కేవలం 2వేల మందికి మాత్రమే నిరుద్యోగ భృతిని మూడు నెలలు ఇచ్చారు. అదీ కూడా ఎన్నికలకు ముందు పంపిణీ చేశారు. నిరుద్యోగ భృతి ఇస్తామని చెప్పి అంక్షలు పెట్టి అప్పట్లో చంద్రబాబు నిరుద్యోగులకు నిండా మోసం చేశారు. ఇప్పుడు కూడా అదే రీతిని నిరుద్యోగ భృతి రూ.3వేలు ఇస్తామని, ఇంటికో ఉద్యోగం వేయిస్తామని చెప్పి సూపర్ సిక్స్‌లో చేర్చి దగా చేసే దిశగా ప్రభుత్వం ఉందనే అనుమానాలను వ్యక్తం చేస్తున్నారు. ఒక పక్క వయస్సు మీద పడుతుండగా చంద్రబాబు ఇచ్చిన హామీ మేరకు వేల రూపాయాలు ఖర్చుసి కోచింగ్‌లు తీసుకుని ఉద్యోగాల కోసం యువత ఎదురు చూస్తుండగా మరో పక్కన నిరుద్యోగ భృతి అయిన వస్తుందని ఆశిస్తున్న వారు సూపర్ మోసం జరుగుతుందని ఆందోళన చెందుతున్నారు. ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు ఇంటి కో ఉద్యోగం లేదా వెంటనే నిరుద్యోగ భృతిని ఇవ్వాలని నిరుద్యోగ యువత ప్రభుత్వాని డిమాండ్ చేస్తోంది.

భృతిపై నీళ్లు చల్లే ప్రయత్నం



సూపర్ సిక్స్ అంటూ కూటమి పార్టీలు ఎన్నికల హామీలు ఇచ్చి గెలిచాయి. కానీ అమలులో మాత్రం యూటర్న్ విధానం అవలంబిస్తోంది. రాష్ట్రంలో నిరుద్యోగులంతా ఆశగా ఎదురు చూస్తున్న ఉద్యోగ అవకాశాలు కల్పన లేకపోగా, నిరుద్యోగ భృతిపై నీళ్ల చల్లే ప్రయత్నాలు చేస్తోంది. హామీలు అమలు చేస్తుందా లేదా అని సర్వత్రా అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. దీనికి ప్రభుత్వం, కూటమి నాయకులు సమాధానం చెప్పాలి.

– పిల్లి సూర్యప్రకాశ్, కోఆర్డినేటర్, వైఎస్సార్ సీపీ, రామచంద్రపురం నియోజకవర్గం

ఇంటికో ఉద్యోగం ఇవ్వాల్సిందే



కూటమి మానిఫెస్టోలో ప్రతి ఇంటికి ఉద్యోగం ఇస్తామని చెప్పారు. అర్హులైన యువకులకు నిరుద్యోగ భృతి ఇస్తామన్నారు. ఇచ్చిన హామీలు ఇప్పటి నుంచి అమలు చేస్తారన్నదానిపై ప్రజలకు స్పష్టతనివ్వాలి. ప్రతి హామీని నిలబెట్టుకోవాల్సిందే.

– తోట త్రిమూర్తులు, ఎమ్మెల్సీ, మండపేట

ఇమాం హుస్సేన్ పరివారానికి నివాళులు



ద్రాక్షారామలో పీర్లు ఊరేగిస్తున్న చిన్నారులు, భక్తులు

రామచంద్రపురం రూరల్: ముస్లింల ఆరాధ్య దైవం మహమ్మద్ ప్రవక్త మనుమడు హజరత్ ఇమాం హుస్సేన్, అతని 72 మంది పరివారానికి ద్రాక్షారామలోని ముస్లింలు సోమవారం ఘనంగా నివాళులు అర్పించారు. ద్రాక్షారామలో పది రోజుల మొహర్రం సంతాప దినాలను పురస్కరించుకుని 20 పంజాలలో ప్రతిరోజూ పీర్లకు పూల అలంకరణ, ధూమ, గంధ, ఫాతిహా తదితర సాంప్రదాయ పూజా కార్యక్రమాలు నిర్వహించారు. మొహర్రం సంతాప దినాలు ఈ నెల 7వ తేదీన ప్రారంభమై 17న షహాదత్ వీరమరణంతో ముగియనున్నాయి. తర్వాత ఆయా పంజాలలో ప్రతిరోజూ మజ్లిస్‌ల అనంతరం మాతం, పీర్ల ఊరేగింపు, నిప్పులపై నడవడం వంటి భక్తి కార్యక్రమాలు జరుగుతున్నాయి. ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన భక్తులకు అంజుమనే సంఘాలు, పంజా ధర్మకర్తలు భోజన వసతి కల్పిస్తున్నారు. చలివేంద్రాలు ఏర్పాటు చేశారు. కర్ణాటక నుంచి విచ్చేసిన మత గురువు అఫ్జర్ అబేది హుస్సేన్ సాహెబ్ మజ్లిస్ ఆలపిస్తున్నారు.

చట్టాలపై అవగాహన పెంచుకోవాలి



గొల్లపాలెంలో ర్యాలీ నిర్వహిస్తున్న ఆరోగ్యశాఖ సిబ్బంది, అంగన్‌వాడీ సిబ్బంది

కాజులూరు: బాలికలు, మహిళలకు ప్రభుత్వాలు కల్పించిన చట్టాలపై ప్రజలు అవగాహన పెంచుకోవాలని గొల్లపాలెం పీహెచ్‌సీ వైద్యాధికారి ఎస్.సౌజన్య అన్నారు. తాళ్లరేవు ఐసీడీఎస్ సీడీపీఓ మాధవి ఆధ్వర్యంలో సోమవారం అంగన్‌వాడీ సిబ్బంది గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. బాలికలు, మహిళా చట్టాలపై అవగాహన కల్పించారు. ఐసీడీఎస్ సీడీపీఓ మాధవి మాట్లాడుతూ అనుమతి లేకుండా బాలికలపై ఎవ్వరు చేతులు వేసి అభ్యంతరకరంగా ప్రవర్తించినా అది నేరమే అవుతుందన్నారు. గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌లపై బాలికలకు అవగాహన కల్పించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్స్ ఎస్‌బీ మాణిక్యాంబ, పి.కనకరత్నం, సెక్టారు పరిధిలోని అంగన్‌వాడీ సిబ్బంది, స్థానిక మహిళలు పాల్గొన్నారు.

విచక్షణా రహితంగా సాగు నీరు వాడొద్దు



పుల్లేటికుర్రులో రైతులకు శిక్షణ ఇస్తున్న జిల్లా అధికారి ఎలియాజర్

అంబాజీపేట: విచక్షణ రహితంగా సాగు నీరు వాడకం వల్ల పంటలపై తీవ్ర ప్రభావం పడి దిగుబడులు తగ్గుతున్నాయని ఉమ్మడి జిల్లాల ప్రకృతి వ్యవసాయ అధికారి జె.ఎలియాజర్ అన్నారు. అంతర్జాతీయ వరి పరిశోధన కేంద్రం, జర్మనీ సంస్థ, వలమ్ అగ్రి ఆధ్వర్యంలో వక్కలంక, కముజువారిలంక, ఇరుసుమండ, కె.పెదపూడి, ముక్కామల, పుల్లేటికుర్రు గ్రామాల్లో కార్బన్ ఉద్గారాల నియంత్రణపై సోమవారం రైతులకు శిక్షణ తరగతులను నిర్వహించారు. ఎలియాజర్ మాట్లాడుతూ అధికంగా సాగు నీరు వినియోగిస్తే భూమి యొక్క భౌతిక, రసాయన, జీవ ధర్మాలు మారిపోయి పంటలు పండించడానికి వీలు కాకుండా తయారవుతున్నాయన్నారు. సాగు ఎంతవరకు ఉపయోగమో అంతవరకు మాత్రమే వినియోగించుకోవాలన్నారు. రసాయన ఎరువులకు బదులుగా ఘన, ద్రవ జీవామృతాలను వినియోగించాలన్నారు. అలాగే పురుగులు, తెగుళ్ల నివారణకు ప్రత్యామ్నాయంగా కషాయాలను వాడాలని రైతులకు వివరించారు. ప్రతి రైతు పెరటి తోటలు పెంచడం వల్ల భూమి సారం పెరగడంతో పాటు అధిక లాభాలు పొందవచ్చన్నారు, వరి గట్లు చుట్టూ పలు పంటలు పెంచుకోవడంపై శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో సుస్థిర వ్యవసాయ కేంద్ర ప్రతినిధులు ఉదయ్, ప్రసంగి, అంతర్జాతీయ వరి పరిశోధన కేంద్రం ప్రతినిధి అఖిల్‌యాదవ్, అడిషినల్ డీపీఎం సత్యనారాయణ, ఎన్ఎఫ్ఏ రాధిక, ఎంపీ ఎ.నాగవేణి, ఐసీఆర్పీలు, యూనిట్ ఇన్‌చార్జిలు తదితరులు పాల్గొన్నారు.

అంగర గ్రామాభివృద్ధికి కట్టుబడి ఉన్నాం

కపిలేశ్వరపురం: అంగర గ్రామాభివృద్ధికి కట్టుబడి ఉన్నామని టీడీపీ అమలాపురం పార్లమెంట్ నియోజకవర్గం ఇన్‌చార్జి పుత్సల శ్రీనివాస్ స్పష్టం చేశారు. అంగరలో పార్టీ నాయకుడు మత్సా గంగరాజుతో కలిసి విలేకరులతో మాట్లాడారు. గ్రామంలో రహదారుల నిర్మాణానికి ప్రణాళికను సిద్ధం చేశామన్నారు. పెండింగ్‌లో ఉన్న పింఛన్లు మంజూరు చేసేందుకు కృషి చేస్తామన్నారు.

మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం



మృతుని కుటుంబానికి ఆర్థిక సాయం అందిస్తున్న దాతలు

మలికిపురం: మండలంలోని విశ్వేశ్వరాయపురంలో ఇటీవల మృతి చెందిన దింపు కార్మికుడు పింద్రాల పోలయ్యకు స్థానిక మానవతా మూర్తులు గ్రూపు ఆధ్వర్యంలో సమకూర్చిన ఆర్థిక సాయం అందించారు. ప్రత్తిపాడు మండలం చింతల్లంక నుంచి వలస వచ్చి విశ్వేశ్వరాయపురంలో అద్దె ఇంట్లో ఉంటూ తాటిముంజెలు, కొబ్బరి బొండాలు తదితరాలు అమ్ముకుని జీవిస్తున్న పింద్రాల పోశయ్య (39) దురదృష్టవశాత్తూ గత మే నెలాఖరున చెట్టుపై నుంచి పడిపోవడంతో మృతి చెందాడు. అతనికి భార్య, ముగ్గురు పిల్లలు.. ప్రస్తుతం కుటుంబం గడిచే పరిస్థితి లేదు. పిల్లలతో పుట్టింటికి చేరిన పోశయ్య భార్య దుర్గ స్థానిక పెద్దల సహకారంతో మానవతా మూర్తులు గ్రూపును ఆశ్రయించారు. దాంతో గతంలో ఏదైనా మంచి కార్యం జరిగినప్పుడు తమ వంతు సహకారం అందిస్తామని చెప్పిన దాతల సహకారంతో రూ.10 వేల నగదు, నిత్యావసరాలను కాకినాడ నుంచి విచ్చేసిన సేవాభిలాషి సుంకర సుధీర్, తాటిపాక పీహెచ్‌సీ వైద్యాధికారిణి మానస చేతుల మీదుగా సోమవారం అందించారు. అక్కరాజు రాజేశ్వరరావు హైదరాబాద్ రూ.5 వేలు, లక్కవరానికి చెందిన రుద్రరాజు రంగరాజు రూ.2 వేలు సాయం అందించినట్లు గ్రూపు సభ్యులు బోనం రాజు తెలిపారు. ఈ మొత్తాలతో పాటు నల్లి మోహన్ మాస్టారు 26 కేజీల బియ్యం, ఇరుసుమండకు చెందిన కాజా నరసింహారావు నిత్యావసరాలు అందించారు. స్థానిక జెడ్పీ హైస్కూల్ ప్రాంగణంలో హెడ్ మాస్టర్ చింతామణి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సర్పంచ్ హెలీనా, రాపాక రత్నరాజు, కాజా నరసింహారావు, పల్లపోతు జైదీప్, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

శిక్షణను సమర్థవంతంగా నిర్వహించాలి



మాస్టర్ ట్రైనర్లతో సమావేశంలో మాట్లాడుతున్న డీఈవో కమలకుమారి

అమలాపురం రూరల్: ఈ నెల 18 నుంచి నిర్వహించే టీచ్ టూల్ ట్రైనింగ్స్‌ను సమర్థవంతంగా నిర్వహించాలని జిల్లా విద్యాశాఖాధికారి ఎం.కమల కుమారి పిలుపునిచ్చారు. మండల విద్యాశాఖ కార్యాలయ సమావేశపు హాలులో సోమవారం టీచ్ టూల్ మాస్టర్ ట్రైనర్లకు ఒక రోజు ఓరియంటేషన్ తరగతి నిర్వహించారు. ఈ సందర్భంగా డీఈవో కమలకుమారి మాట్లాడుతూ మాస్టర్ ట్రైనర్స్ అబ్జర్వర్లకు మంచి కంటెంట్‌ను అందజేయాలన్నారు. స్నేహపూర్వక వాతావరణంలో తొమ్మిది రోజుల శిక్షణను నిర్వహించాలని సూచించారు. జిల్లా అకడమిక్ మానిటరింగ్ అధికారి పి.రాంబాబు మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా 415 మంది అబ్జర్వర్లకు తొమ్మిది రోజుల శిక్షణ నాన్ రెసిడెన్షియల్ విధానంలో ఇస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో సమగ్ర శిక్షా ఏపీవో డాక్టర్ ఎంఏకే భీమారావు, ఎల్ఎఫ్ఈ డిస్ట్రిక్ట్ కోఆర్డినేటర్స్ పి.వివేక్, ఎం.పూజ, ఎంఈవో-2 ఎస్.దుర్గాదేవి పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధికి సహకరించండి



నగరం గ్రామసభలో మాట్లాడుతున్న సర్పంచ్ రమణకుమారి

మామిడికుదురు: నగరం గ్రామాన్ని అభివృద్ధి చేసేందుకు సమష్టిగా ముందుకు వెళదామంటూ సర్పంచ్ జాలెం రమణకుమారి కోరారు. పంచాయతీ కార్యాలయంలో సోమవారం నగరం గ్రామ సర్పంచ్ రమణకుమారి అధ్యక్షతన జరిగింది. చమురు సంస్థలకు చెందిన సోలార్ ప్లాంట్ నుంచి పన్ను చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలని వార్డు సభ్యులు బత్తుల సురేష్, కోళ్ల సురేష్, కదలి శ్రీనివాసరావు కోరారు. జాతీయ రహదారికి వచ్చే లింకు రోడ్లపై స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలని, లేని పక్షంలో ప్రజలు ప్రమాదాల బారిన పడుతున్నారని పలువురు సభ్యులు కోరారు. గ్రామంలో చేపట్టనున్న 18 రహదారుల నిర్మాణంతో పాటు ఇతర అభివృద్ధి పనులపై సమావేశంలో చర్చించారు. ఉప సర్పంచ్ అన్వర్ తాహిర్ హుస్సేన్, కార్యదర్శి పీవీఎస్‌వీ ప్రసాద్, గ్రామ పెద్దలు జాలెం సుబ్బారావు, జాలెం శ్రీనివాసరాజు, తదితరులు పాల్గొన్నారు.

క్విజ్ విజేతలకు బహుమతుల పంపిణీ

ఆలమూరు: మండలంలోని చెముడులంకలోని తిర్నాతి సూర్యనారాయణమూర్తి జిల్లా ప్రజాపరిషత్ పాఠశాలలో సోమవారం నిర్వహించిన క్విజ్ పోటీల విజేతలకు బహుమతుల పంపిణీ జరిగింది. అమెరికాలోని ప్రవాస భారతీయులు, తిర్నాతి వంశీయులకు చెందిన తిర్నాతి శ్రీహిత్ ఎంటర్‌ప్రెన్యూర్ షిప్ ఓరియేంటేషన్ ప్రతినిధులు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ పోటీల్లో ప్రథమ బహుమతిని పవన్‌కుమార్, ద్వితీయ బహుమతిని సూర్యప్రకాష్ సాధించారు. గెలుపొందిన విజేతలకు నగదుతో పాటు, వెండి పతకాలను అందజేశారు. ఈసందర్భంగా అమెరికా ప్రతినిధులైన శ్రీహిత్, స్టీవ్ గార్డినర్ తదితరులు విద్యార్థులకు చక్కని సందేశాన్ని ఇచ్చారు. అనంతరం ప్రధానోపాధ్యాయుడు బి.శివరామకుమార్‌ను ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు. తిర్నాతి లవకేశవరావు, వంశీ, వెంకటేశ్వరరావు, కృష్ణమోహన్ పాల్గొన్నారు.

రెండు గ్రామాల్లో తాగునీటి పరీక్షలు

మామిడికుదురు: డయోరియా, వైరల్ జ్వరాల ప్రభావం తీవ్రంగా ఉన్న నేపథ్యంలో వ్యాధుల వ్యాప్తికి ప్రధాన కారణమైన తాగునీటి నాణ్యతపై అధికారులు ప్రధానంగా దృష్టి సారించారు. దీనిలో భాగంగా సోమవారం లూటుకుర్రు, బి.దొడ్డవరం గ్రామాల్లో జల్‌జీవన్ మిషన్ ప్రతినిధులు తాగునీటి నాణ్యత పరీక్షలు నిర్వహించారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ జయశ్రీ పర్యవేక్షణలో జల్‌జీవన్ మిషన్ ప్రతినిధులు గోవిందు, భరత్ తాగునీటి నాణ్యతా పరీక్షలు చేశారు. దీంతో పాటు రెండు గ్రామాల్లో జరుగుతున్న తాగునీటి సరఫరా, కుళాయిల ఏర్పాటు తదితర అంశాలను కూడా పరిశీలించారు. కార్యక్రమాల్లో సర్పంచ్‌లు అడబాల తాతకాపు, చెల్లుబోయిన రామశివసుబ్రహ్మణ్యం, ఎంపీటీసీ వాసంశెట్టి వెంకటరమణ, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

స్వర్ణకారులను ప్రభుత్వం ఆదుకోవాలి

కాజులూరు: జీవనోపాధి కోల్పోతున్న స్వర్ణకారులను ప్రభుత్వం తగిన ప్రోత్సాహాన్ని అందించి ఆదుకోవాలని మండల స్వర్ణకారుల సంఘం నాయకుడు గౌరీపట్నం రామలింగేశ్వర్రావు అన్నారు. సోమవారం కాజులూరులో జరిగిన స్వర్ణకారుల సంఘం సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇటీవల కాలంలో రేడీమేడ్ ఆభరణాలు విక్రయించే పెద్దపెద్ద సంస్థలు వినూత్న ప్రచారలతో పోటీపడుతూ వినియోగదారులను ఆకట్టుకుంటున్నాయన్నారు. దీంతో దశాబ్దాల కాలం నుంచి వంశపారంపర్యంగా ఆభరణాల తయారీ చేస్తున్న స్వర్ణకారులు జీవనోపాధి కోల్పోతున్నారన్నారు. పాలకులు స్పందించి చేతివృతి సంఘాలకు నిధులు కేటాయించాలని స్వర్ణకారులకు జీవనోపాధి కల్పించి ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

మొక్కలు నాటిన బీజేపీ నేతలు



లొల్లలో మొక్కలు నాటుతున్న బీజేపీ నాయకులు

రాయవరం: లొల్ల గ్రామంలో బీజేపీ నాయకులు సోమవారం మొక్కలు నాటారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఇచ్చిన పిలుపు మేరకు అమ్మ కోసం మొక్క పేరుతో మొక్కలు నాటారు. స్థానిక చెరువు గట్టున బీజేపీ మండల శాఖ అధ్యక్షుడు శాఖ దుర్గా శ్రీనివాస్ ఆధ్వర్యంలో మండల బీజేపీ నాయకులు మొక్కలు నాటారు. కార్యక్రమంలో లొల్ల సర్పంచ్ చాట్రాతి జానకిరాంబాబు, నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, చిరట్ల సుబ్బారావు, ఈరెళ్ల కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మీనృసింహునికి జన్మనక్షత్ర పూజలు



స్వాతి నక్షత్రం పూజలు చేస్తున్న అర్చకులు

సఖినేటిపల్లి: అంతర్వేది ఆలయంలో లక్ష్మీనృసింహుని జన్మనక్షత్రం స్వాతి పురస్కరించుకుని సోమవారం స్వామివారికి అష్టోత్తర కలశాభిషేకం అర్చకులు నిర్వహించారు. ప్రధాన అర్చకుడు పాణింగిపల్లి శ్రీనివాస కిరణ్ ఆధ్వర్యాన స్థానాచార్య వింజమూరి రామరంగాచార్యులు, అర్చకులు ఈ పూజలు నిర్వహించారు. తొలుత వశిష్ఠ గోదావరి నది నుంచి కలశాలతో తెచ్చిన పవిత్ర జలాలకు వేదమంత్రాలతో పూజలు నిర్వహించారు. కలశాల్లోని జలాల్లోకి శ్రీస్వామివారి మూల మంత్రంతో ఆవాహనం చేసి అర్చన చేశారు. అలాగే సర్వదేవతలను కలశాల్లోకి ఆవాహనం చేసి విశేష పూజలు నిర్వహించారు. వీటితో పాటు పంచామృతాలతో, వేదమంత్రోచ్ఛారణల మధ్య స్వామికి విశేష అభిషేకం చేశారు. ఆలయ అసిస్టెంట్ కమిషనర్ వి.సత్యనారాయణ, భక్తులు పాల్గొన్నారు.